సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
బుధవారం 23 అక్టోబర్ 2024 | పేజీలు 8



24లోగా ప్రతి బాధితునికి

# నష్టపరిహారం

- 1లక్ష 44 వేలకు పైగా బాధితులకు రూ. 235.72 కోట్లు ఖాతాలలో జమ
- పరిశీలనలో 2,478 ధరఖాస్తులు 476 ధరఖాస్తుల బ్యాంకు ఖాతాల విఫలం...
- బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..
- జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** ఇటీవల వరద ముంపు ప్రభావంతో నష్టపోయిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం పరంగా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఇప్పటి వరకు

2 లో

వివరాలు 2లో...

రెండు యూనిట్లకు అనుమతులు లేవని సమాచారం!




# సెంటినీలో సీఐడీ తనిఖీలు

విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్ట్‌లకు

# సహకారం అందించండి

- అమృత్ 2 పథకం పనుల కొనసాగింపునకు సహకరించండి
- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కట్టర్ కు ఏపీ మంత్రి నారాయణ ప్రతిపాదనలు
- ఢిల్లీలో రెండోరోజు కొనసాగిన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పర్యటన



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్ట్‌ల విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ను ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ కోరారు. రెండో రోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో నారాయణ భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి నారాయణతో పాటు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ కూడా పాల్గొన్నారు. 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలోనే విజయవాడ, విశాఖపట్నంలో మెట్రో రైల్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసారు...2015 వ సంవత్సరంలోనే డీపీఆర్‌లు కూడా సిద్ధం అయ్యాయి..ఆయా ప్రాజెక్ట్‌లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు కూడా జరిగాయి.

మిగతా 2లో

# ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలి

- జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి
- అధికారులందరూ సమన్వయంతో కలిసికట్టుగా పని చేయాలి
- మచిలీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి కే స్వాతి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రానున్న దీపావళి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని మచిలీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి కే స్వాతి తెలిపారు. మంగళవారం ఉదయం రెవెన్యూ డివిజన్ అధికారి నగరంలోని కలెక్టరేట్ లో గల వారి కార్యాలయంలో దీపావళి బాణాసంచా లైసెన్సులు, అమ్మకాలు,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి దీపావళి పండుగ సందర్భంగా ఏ ఒక్కరికి ప్రమాదం జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు డివిజన్లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వ్యాపారస్తులకు బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేయుటకు అనుమతులు ఇవ్వాల్సి ఉందన్నారు. చిన్న విషయం కదా అని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా భద్రతా చర్యలకు సంబంధించి ఏమైనా సమాచారం అందగానే ఆ దుకాణాలను తనిఖీ చేసి భద్రత చర్యలు పాటించేలాగా చూడాలన్నారు. భద్రత చర్యలు పాటించని వారి పై నిబంధనల మేరకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలన్నారు ఏవైనా సంఘటనలు జరిగిన తర్వాత కాకుండా ముందుగానే పసిగట్టి జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. గతంలో దీపావళి సందర్భంగా 100 నుంచి 150 దుకాణాలను ఒకే చోట ఏర్పాటు చేసే వారని ఒకే చోట జనమంతా కిక్కిరిసి లేకుండా ఈసారి ప్రమాదాలు నివారించేం దుకు నేషనల్, హిందూ కళాశాలలతో పాటు మాచవరం తదితర ప్రాంతాల్లో వేరు వేరు చోట్ల రెండు మూడు అనువైన ప్రదేశాలను అందరూ కలిసి సందర్శించి ఎంపిక చేసి దుకాణాలు కేటాయించే విధంగా ఏర్పాటు చేయాల న్నారు. వ్యాపారస్తులకు దుకాణాలు ఏర్పాటు కోసం అనుమతులు ఇచ్చే సమయంలోనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కచ్చితంగా పాటించవలసిన నిబంధనల గురించి వివరించాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా చట్ట ప్రకారంగా శిక్షింపబడతారని హెచ్చరించాలన్నారు ముఖ్యంగా షామియానాలు కాకుండా రేకుల షెడ్లతో దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో దుకాణానికి మధ్యలో మూడు మీటర్ల దూరం ఉండేలా చూడాలన్నారు. ప్రజలకు ప్రవేశం, నిష్క్రమణ మార్గాలు వేరువేరుగా ఉండాలన్నారు.

మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)



## 24లోగా ప్రతి బాధితునికి నష్టపరిహారం

1 లక్ష 44 వేల 672 మంది బాధితుల ఖాతాల్లో రూ. 235 కోట్ల 72 లక్షల నగదు జమచేయడం జరిగిందని, పెండింగ్‌లో ఉన్న 2,478 ధరఖాస్తులను పరిశీలించి నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసకుంటున్నామని, బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా అన్నారు. అధిక వర్షాలు, బుడమేరు వరద ప్రభావంతో నష్టపోయిన బాధితులకు పరిహారం చెల్లింపులపై మంగళవారం నగరంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ నిధిమీనా, డిఆర్వో వి. శ్రీనివాసరావుతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో సెప్టెంబర్ నెలలో సంభవించిన అధిక వర్షాలు, బుడమేరు వరద ప్రభావంతో జరిగిన నష్టంలో భాగంగా హౌసింగ్, ఎయ్ఎస్ఎంఇ, వాహనాలు, తదితర విభాగాలకు సంబంధించి 1లక్ష 44 వేల 672 మంది వరద ప్రభావిత బాధితులకు 235 కోట్ల 72 లక్షల నగదు లబ్దిదారుల ఖాతాలలో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. 179 గ్రామ వార్డు సచివాలయాలలో వరద గణన జాబితాల ప్రచురణతో పాటు అదనంగా వచ్చిన ధరఖాస్తులను పిజిఆర్ఎస్ ఫ్లడ్ మాడ్యూల్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఆధార్‌తో బ్యాంకు ఖాతా అనుసంధానించబడిన బ్యాంకు ఖాతాలకు నేరుగా పరిహారం జమ చేయడం జరిగిందన్నారు. బ్యాంకు ఖాతాలు అనుసంధానం కాని 476 ఖాతాలను అనుసంధానం చేసి చెల్లింపుల ప్రక్రియ జరిపేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వీటితో పాటు ఇంకనూ పరిష్కరించవలసిన 2,478 ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెల 24వ తేదీలోగా ధరఖాస్తులను పరిష్కరించి అర్హులైన బాధితుల ఖాతాలలో నష్ట పరిహారం చెల్లింపులు చేయనున్నామన్నారు. నష్టపోయిన ప్రతి బాధితునికి పరిహారం చెల్లించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ఏ ఒక్కరూ ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం తప్పనిసరిగా అందుతుందన్నారు. ఏ ఒక్క బాధిత కుటుంబానికి పరిహారం అందకుండా మిగిలిపోకూడదనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పాదర్శకమైన చర్యలు తీసుకున్నామని ఈనెల 24వ తేదిలోపు బాధితుల ఖాతాలలో ఆర్థిక సహాయాన్ని అందించేలా ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నష్ట పరిహారం అందించడం జరుగుతుందని జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ నిధి మీనా తెలిపారు.

## ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలి



జనావాసాల మధ్యలో బాణాసంచా దుకాణాలు ఉండరాదన్నారు. దుకాణాలు ఎదురెదురుగా లేకుండా ఎల్ ఆకారంలో ఉండే విధంగా చూడాలన్నారు. ఇప్పుడిప్పుడే రెండు లేదా మూడు దరఖాస్తులు వచ్చాయని ఇంకా ఎక్కువగా దరఖాస్తులు వచ్చాక దరఖాస్తుదారులతో సమావేశం నిర్వహించి భద్రత చర్యలు ఏమి తీసుకోవాలో వారికి మరల ఒకసారి తెలపడం జరుగుతుందన్నారు. చిన్నపిల్లలను దుకాణాల్లో పనులకు పెట్టుకోరాదని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కార్మిక చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించాలన్నారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా శాంతి భద్రతలకు విఘాతము కలగకుండా దీపావళి పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకొనుటకు అందరూ సహకరించాలన్నారు ఈ సమావేశంలో మచిలీపట్నం, అవనిగడ్డ సిఐలు షేక్ అబ్దుల్ నబీ, జి యువకుమార్, పెడన మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, సహాయ అగ్నిమాపక అధికారి నరసింహారావు, విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాసులు, మచిలీపట్నం రెవిన్యూ డివిజన్లోని తహసిల్దారులు పాల్గొన్నారు.

# సెంటినీలో సీఐడీ తనిఖీలు

### రెండు యూనిట్లకు అనుమతులు లేవనే సమాచారం






**కంచికచర్ల అక్టోబర్ 22 మేజర్ న్యూస్ :** మండలం లోని గండేపల్లి సెంటనీ బయోటెక్ కర్మాగారంలో ఏపీ సిఐడి అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. సేకరించిన సమాచారం మేరకు కర్మాగారంలోని మద్యం తయారీ కి సెంటినీ బయో ప్రొడక్ట్స్, సెంటినీ స్పిరిట్స్ ద్వారా బాటిలింగ్ తయారవుతున్నట్లు తెలిసింది. గతంలో సెంటినీ బయో ప్రొడక్ట్స్ మాత్రమే పని చేసేది, ఇప్పుడు రెండు యూనిట్లు పనిచేయడం రెండవ యూనిట్కి అనుమతులు లేవనే సమాచారం వినిపిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో బాటిలింగ్ కొందరు బయటి వారికి లీజుకి ఇచ్చిన సమాచారం, అనుమతి లేని యూనిట్ నడుపుతున్న విషయం తెలుసుకున్న సిఐడి అధికారులు మంగళవారం క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తుంది. సిఐడి అధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎక్సైజ్ అధికారులు కర్మాగారం లోపలికి వెళ్లి వారికి సహకరిస్తున్నారు. కర్మాగారంలోకి ఎవరిని అనుమతించకుండా ప్రధాన గేటు వద్దనే సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుంటున్నారు. ఈ కర్మాగారంలో మొక్కజొన్నలు, బియ్యం తదితర వాటితో మద్యం, ఇథ్నాల్ తయారు చేసేందుకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సిఐడి అధికారులు బాటిలింగ్ యూనిట్ మొత్తం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్ట్‌లకు సహకారం అందించండి



(మొదటిపేజీ తరువాయి)

అయితే ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం మెట్రో రైల్ ప్రాజెక్ట్‌లను ఏమాత్రం పట్టించుకోలేదు..తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఈ ప్రాజెక్ట్ లపై దృష్టి సారించింది..ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ లకు సంబంధించి తాజా నివేదికలు సిద్ధం చేసింది రాష్ట్ర ప్రభుత్వం.ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌తో భేటీ సందర్భంగా తాజా ప్రతిపాదనలతో పూర్తి వివరాలు అందించారు మంత్రి నారాయణ...గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన రెండు ప్రాజెక్ట్‌లపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు..మరోవైపు విజయవాడ మెట్రోను రాజధాని అమరావతి కి అనుసంధానించే ప్రతిపాదనలు కూడా ఇప్పటికే కేంద్రానికి పంపినట్లు ఖట్టర్ దృష్టికి తీసుకెళ్లారు నారాయణ..

**అమృత్ 2 పథకం పనుల కొనసాగింపునకు సహకరించండి**

మరో వైపు అమృత్ 2 పథకం అమలుపైనా ఇరువురి మధ్య కీలక చర్చ జరిగింది. అమృత్ పథకం కింద రాష్ట్రంలోని పలు మున్సిపాల్టీల్లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టింది రాష్ట్ర ప్రభుత్వం...నాటి టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం కొనసాగించలేదు..పైగా అమృత్ పథకం ద్వారా కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా నిధులు కూడా విడుదల చేయకపోవడంతో ప్రాజెక్ట్ మొత్తం నిలిచిపోయింది..గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అమృత్ పథకం అమలుకు నోచుకోలేదని..ఆ పథకాన్ని ఇప్పుడు కొనసాగించాలని కోరారు..మంత్రి నారాయణ ప్రతిపాదనలకు కేంద్ర మంత్రి ఖట్టర్ సానుకూలంగా స్పందించారు...

# జర్నలిస్టు వరమోహన్ సేవలు నిరుపమానం



**విజయవాడ, అక్టోబర్ 22 మేజర్ న్యూస్ :** ఓ దినపత్రికలో సుదీర్ఘ కాలం పాటు జర్నలిస్టుగా పనిచేసిన పరుచూరి వారి మోహన్ కుమార్ (బాబీ) సమాజానికి చేసిన సేవలు నిరుపమానమని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం ఉదయం అజిత్ సింగ్ నగర్ లోని అంబేద్కర్ గ్రంథాలయంలో జరిగిన వరమోహన్ కుమార్ 44వ జయంతి కార్యక్రమంలో ఘనంగా నివాళులర్పించిన తెలుగుదేశం పార్టీ నాయకులు యలవర్తి శ్రీకాంత్ మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిలో జర్నలిస్టులది కీలక పాత్ర అని, అంకితభావంతో పనిచేసే జర్నలిస్టులకు ప్రజాధరణ ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలోను, ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలకు తెలియపరచడంలో మీడియా కీలకంగా, మీడియాలో జర్నలిస్ట్ పనిచేసే వారు మరింత కీలకమన్నారు. అజిత్ సింగ్ నగర్ ప్రాంత జర్నలిస్టులు ఒక సంఘం ఏర్పడితే తదుపరి వారు నిర్వహించే సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఇస్తానని తెలిపారు. ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు షేక్ మౌలాలి మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలిచేది జర్నలిస్టులేనని, వారి సేవలను గుర్తించి వారి అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులు దారం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టుల మధ్య ఐక్యత ఎంతో అవసరమని, ఈ ప్రాంత జర్నలిస్టులు అందరూ ఏపీయూడబ్ల్యూజే యూనియన్ లో చేరితే ఆ యూనియన్ కు అనుబంధంగా ఈ ప్రాంతానికి ప్రత్యేక విభాగం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుని జర్నలిస్టుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుగా వరమోహన్ ఈ ప్రాంత సమస్యల పరిష్కారం లో చూపిన చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వరమోహన్ ఫ్రెండ్స్ సర్కిల్ కన్వీనర్ భూక్యా రమేష్, కుప్పం బాలాజీ, సీనియర్ జర్నలిస్టులు పి శిఖామణి, ఎంహెచ్ చక్రవర్తి, కేశవరపు వెంకటేశ్వరరావు, కామళ్ళ శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, రత్న కిషోర్, రాఘవ, సురేష్, సాయి, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల





**విజయవాడ మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వం రైతాంగానికి రూ. 1674 కోట్లు ధాన్యం బకాయిలు పెట్టడమే కాకుండా రాష్ట్రం మీద రూ. 11 లక్షల కోట్లు అప్పులు చేసిందని, జిల్లా ఇన్ చార్జి మంత్రి , రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం ఉంగుటూరు మండలం చేబ్రోలు రైతు సేవాకేంద్రంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ , దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందులకు గురి చేసినా కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారి సహకారంతో బ్యాంకుల ను సంప్రదించి నెల రోజుల్లో రైతులకు రావాల్సిన బకాయిలను చెల్లించామన్నారు. రైస్ మిల్లు యాజమాన్యం తేమ శాతం ఎక్కువ అని సాకులు చెప్తూ, మిల్లర్లు ర్యాండమైజేషన్ పేరుతో వారికి కావాల్సిన మిల్లుకు ధాన్యాన్ని తరలించేలా చేయటంతో రైతులు అవస్థలు పడ్డారన్నారు. ప్రస్తుతం రైతులు తాము ఏ మిల్లుకు ధాన్యం తరలించాలనేది వారే ఎంపిక చేసుకునే అవకాశం కల్పించామన్నారు. అలాగే రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తూ రైతులు ధాన్యాన్ని రైస్ మిల్లర్లుకి అప్పగించిన 48 గంటల్లోనే వారి అకౌంట్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకున్నామని, ఇది ఒక గొప్ప పరిణామమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ. 960 కోట్ల రైస్ మిల్లర్లకు బకాయిలు పెట్టి వారిని కూడా ఇబ్బందులు పాలు చేసిందన్నారు. గోనెసంచులు, రవాణా ఖర్చులు, ప్రభుత్వం భరించి రైతుల అకౌంట్లో జమ చేస్తుందన్నారు. కల్లాల వద్ద ధాన్యం ఆరబెట్టేందుకు 50% సబ్సిడీతో రైతులకు టార్పాలిన్లు అందిస్తున్నామన్నారు. ఇదే రైతు సహాయక కేంద్రాలు గత ప్రభుత్వంలో రూ. 3, 300 కోట్లు ఖర్చు పెట్టారని, అయితే ఏ కౌలు రైతుకైనా దీని వల్ల ఉపయోగం జరిగిందా అని ప్రశ్నించారు. కౌలు రైతు కోసం ఈ పంట నమోదులో ఎవరైతే సాగు చేస్తున్నారో అతను ఈ-పంటలో నమోదు చేసుకుని రైతు సేవాకేంద్రంలో అమ్మకం చేసేలా కూటమి ప్రభుత్వం తొలిసారిగా చర్యలు తీసుకుందన్నారు. ఆదర్శరైతులు రైస్ మిల్లర్లతోటి సమన్వయకమిటీ ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బంధీకా, పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమానికి ముందు చేబ్రోలు రైతు సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేసిన వ్యవసాయ స్టాల్స్ ను మంత్రి సందర్శించారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు వి. శ్రీలక్ష్మి, డిఎస్ఓ ఆర్.ఎస్.ఎస్. రాజు, మైక్రోఇరిగేషన్ పివో ఎ. రవికుమార్, గ్రామ సర్పంచ్ రాధేలక్ష్మిసునీత, డిప్యూటీ కలెక్టర్ కమలాదేవి, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.




# అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా రాజకీయ ప్రక్షాళనకు యువత నడుంకట్టాలి



## ఎన్నికలలో ధన ప్రభావం పెరుగుతున్నది

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆందోళన

## డా శివాజీ ఇంట పిచ్చాపాటి

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎన్నికలలో ధన ప్రభావం నానాటికీ పెరిగిపోతున్నదని....ఎమ్మెల్యే అభ్యర్థి కనీసం రూ.30 కోట్లు ఖర్చు చేయాల్సివస్తున్నదని మంచి వారు కూడా దీనికి అతీతులు కారని, అందుకే యువత రాజకీయాల్లోకి దిగి అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా రాజకీయ ప్రక్షాళన చేయాలంటూ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. తాను పోటీ చేసిన ఎన్నికలలో రూ 10 లు కూడా ఖర్చు చేయలేదని, ప్రజల విరాళాలతో రూ 60 వేలకు మించి ఖర్చు అయ్యేది కాదన్నారు. ఎమర్జన్సీ, జై ఆంధ్ర పలు రైతాంగ ప్రజా ఉద్యమాలలో కలసి పనిచేసిన చిరకాల మిత్రుడు మాజీ రాజ్యసభ సభ్యులు డా.యలమంచలి శివాజీ నివాస గృహానికి వెళ్లి గంట సేపు పైగా ఎంతో ఉల్లాసంగా వివిధ అంశాల పై పిచ్చాపాటి మాట్లాడారు. తొలుత డా.శివాజీ స్వాగతం పలికి సత్కరించారు. ఆపై పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ పాలక వర్గ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డి మల్లిఖార్జునరావు, కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు తదితరులు సత్కరించి అభినందించారు. వెంకయ్యనాయుడు మీడియా తో మాట్లాడుతూ ప్రచార ప్రసార సాధ్యాలు ప్రజా సంక్షేమమే పరమావధిగా నిష్పక్షపాతంగా స్వేచ్ఛ తో వ్యవహరించాల్సి ఉండగా క్రమేణ అసత్యాలు, అపోహలు, సంచలనకు ప్రాధాన్యతనివ్వడం బాధాకరమన్నారు. దీనికి తోడు తాజాగా రాజకీయ నాయకులు, స్వార్థపరులు ఈ రంగం లోకి ప్రవేశించి తమ ఎజెండా కు ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియా ప్రజలకు ఎంతో చేరువవుతున్నదని అన్నారు. సిద్ధాంత రాజకీయాల్లో కొనసాగినం వారు ఎన్నటికీ మంచి వారుగా కీర్తించబడతారనటానికి డా.శివాజీ ఉదాహరణ అని నాయుడు అన్నారు. గ్రామ వికాసం, అభ్యుదయం , పట్టణాల అభివృద్ధికి మరింత పాటుబడాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమం లో సంగం డైరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్ బాబు, స్థానిక పెద్దలు బొల్లేపల్లి సత్యనారాయణ, లంకా సూర్యనారాయణ, దాసరి హనుమంతరావు, జొన్నలగడ్డ రామారావు, అత్తోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.






## టాటా మోటార్స్ దేశ్ కా ట్రక్ ఉత్సవ్ విజయవాడలోని వినియోగదారులను శక్తివంతం చేస్తుంది

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద వాణిజ్య వాహన తయారీ సంస్థ అయిన టాటా మోటార్స్, అక్టోబర్ 24, 2024న విజయవాడలో దేశ్ కా ట్రక్ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని ట్రక్కింగ్ కమ్యూనిటీని వారికి పనికొచ్చే సూచనలతో బలోపేతం చేయడానికి రూపొందించబడింది. టాటా మోటార్స్ తాజా శ్రేణి ట్రక్కులు, వాల్యూ యాడెడ్ సర్వీసెస్‌తో స్వీయ అనుభవం... ఇవన్నీ కూడా లాభదాయకతను పెంపొందించడం, యాజమాన్యం యొక్క తక్కువ మొత్తం ఖర్చు (టి సి ఓ)ని అందించడం లక్ష్యంగా ఉన్నాయి.

## జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం



**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రతీ ఒక్కరూ గర్వపడేవిధంగా జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం జిల్లా ఇంచార్జి మంత్రి గా తొలిసారి కలెక్టరేట్ కి విచ్చేసిన సందర్భంగా జిల్లాకు చెందిన శాసన సభ్యులు, అధికారులు మంత్రికి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఒకే భావన, ఆలోచనలతో కలిసి సమిష్టిగా పనిచేసి, ప్రజలకు మరింత మెరుగైన సేవలందిద్దామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా దృష్టి పెట్టాలన్నారు. పార్లమెంట్ సభ్యులు, జిల్లాపరిషత్ చైర్ పర్సన్, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులకు ప్రజలు అందించే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య , పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్ కుమార్, చిర్రి బాలరాజు, మద్దిపాటి వెంకట రాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, ప్రభృతులు ఉన్నారు.

## వంగవీటి రాధాను పరామర్శించిన మంత్రి నారా లోకేష్



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఇటీవల అస్వస్థతకు గురై కోలుకుంటున్న మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని విజయవాడ చేరుకున్న మంత్రి.. అనంతరం తాడేపల్లి ప్రాతూరులోని వంగవీటి రాధా ఇంటికి స్వయంగా వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వంగవీటి రాధాకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

**ఘంటశాల మేజర్ న్యూస్ :** గ్రామంలోని పంచాయతీ ఆఫీస్ వద్ద వద్ద మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత గుండె వైద్య శిబిరం బుధవారం తెలుగురావుపాలెం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో విజయవాడ నుంచి ప్రముఖ గుండె వైద్య నిపుణులు హెల్ప్ హాస్పట్ కి వైద్య బృందం పాల్గొని, గ్రామంలో గుండె జబ్బులతో బాధపడువారికి ఉచితంగా బీపీ, ఈసీజీ, టుడీ ఈకో(గుండె స్కానిగ్) పరీక్షలు నిర్వహిస్తారు. అంతేకాక ఈ వైద్య శిబిరంలో ఆయాసం, గుండె నొప్పి, గుండె దడ, గుండెలో మంట, గుండె బరువుగా ఉండటం, ఎక్కువ కాలంగా బి.పి, షుగర్ వ్యాధులతో బాధపడేవారికి గుండె పరీక్షలు ఉచితంగా చేయబడును. అవసరం ఉన్నవారికి 12,500/- విలువ గల అంజియోగ్రం టెస్ట్ విజయవాడ హాస్పిటల్ లో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా చేయబడును. కావున గ్రామస్తులు రేపు జరిగే ఈ వైద్య శిబిరంలో పాల్గొని ఉచిత వైద్య సహాయం పొందగలరు.




## అక్రమంగా మద్యం తరలిస్తున్నవ్యక్తి అరెస్ట్

**కోడూరు, మేజర్ న్యూస్ :** నరసింహపురం వెళ్లే రోడ్డు వద్ద ఒక వ్యక్తి మద్యం బోటిల్స్ ను అక్రమంగా తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు స్థానిక ఎస్ ఎస్ఐ కె.చాణఖ్య వాహనాలు మంగళవారం మధ్యాహ్నం తనిఖీలు నిర్వహించగా మద్యం బోటిల్స్ అక్రమంగా తరలిస్తున్న ఒక వ్యక్తిని అదు పులోకి తీసుకుని, అతని వద్ద నుండి 45 మద్యం బాటిళ్లనీ స్వాధీనం చేసు కుని, అతని మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ సందర్భంగా కోడూరు ఎస్ఐ కె.చాణఖ్య మాట్లాడుతూ కోడూరు మండల పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగిన చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కోడూరు మండల పరిధిలో ఎటువంటి అసాం ఘిక కార్యక్రమాలు జరిగిన వెంటనే ఎస్ఐ కె.చాణఖ్య 9440796468, స్టేషన్ ల్యాండ్ లైన్ : 08671276333 నెంబర్లకు సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు.

## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఉన్నతాధికారుల ఆదేశాలతో అవినీతి, అక్రమాల కు పాల పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికడతామని అవనిగడ్డ ఎస్ఐ కే.శ్రీనివాసరావు అన్నా రు. మంగళవారం ఉదయం అవనిగడ్డ మీదుగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకుని తనిఖీలు చేయగా స్టేట్ బ్యాంక్ సెంటర్లో సుమారు నాలుగు టన్నుల రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను గుర్తించి అడ్డు కున్నట్టు ఎస్ఐ తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్న పెద్ద కళ్ళేపల్లి గ్రామానికి చెందిన కూతాడ వెంకన్న బాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## రాజ రాజేశ్వరిని పరామర్శించిన మండలి వెంకట్రామ్



**కోడూరు, మేజర్ న్యూస్ :** కోడూరులో గత కొద్ది కాలం క్రితం తోడికోడలపై కాక నూనె పోసి గాయపరిచిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎందురి స్వామి భార్య రాజరాజేశ్వరిని అవనిగడ్డ నియోజకవర్గ జనసేన యువ నాయకులు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. హాస్పటల్ నుంచి డిశ్చార్జ్ అయి ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న రాజరాజేశ్వరిని మంగ ళవారం పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నా మీద దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి, నాకు న్యాయం చేయాలని రాజేశ్వరి వెంకట్రామ్ ని కోరగా వెంటనే సంబంధిత పోలీస్ అధికారిని పిలిపించి కేసు వివరాలు తెలుసుకొని బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేయించుకోవాలి



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేయించుకోవాలని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ కోరారు. మంగళవారం సాయంత్రం చల్లపల్లి ఏటీఎం సెంటర్లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదు ప్రత్యేక శిబిరాన్ని వెంకట్రామ్ సందర్శించారు. ఎమ్మెల్సీ ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కూటమి నాయకులు ప్రత్యేక చొరవ తీసుకొని ఓట్ల నమోదుపై విస్తృత ప్రచారం చేసి నవంబరు ఆరో తేదీ లోపు పట్టభద్రులు అందరూ ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేయించుకునేలా వారికి సహకరించ చాలని కోరారు. ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాల పట్టభద్రు ల శాసన మండలి నియోజకవర్గ అభ్యర్థిగా ఎన్.డీ.యే కూటమి బలప రిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి బాటలు వేయాలని కోరారు. 2021 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓట్లు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు రావి సూర్యకిరణ్ తేజ, చంద్రమౌళి, వైస్ ఎంపీపీ, టీడీపీ మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ నబీఘోరీ, జనసేన పార్టీ నియోజకవర్గ ఐటీ కోఆర్డినేటర్ సుదాని నందగోపాల్, జనసేన పట్టణ అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు, సీ.హెచ్.సీ డైరెక్టర్ తోట కనకదుర్గ, కూటమి నాయకులు నిడమానూరు దిలీప్ కుమార్, మోర్ల ప్రసాద్, పరిశే మౌళి, తుటారం ప్రసాద్, రావి చంద్రశేఖర్ (చిట్టి), బోలెం రామారావు, రావి రాజు, మడమల రంజిత్, షేక్ సిలార్, బావిశెట్టి కనకదుర్గ, పోతుమర్తి నాగమణి పాల్గొన్నారు.

## కచ్చా డ్రైనేజీ వల్ల నిలువ ఉన్న వర్షపు నీటిని మళ్లించవచ్చు



**పెడన, మేజర్ న్యూస్ :** స్థానిక తోటమూలా తొమ్మిదవ వార్డులో వర్షపు నీరు నిలవ ఉండటం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అక్కడనుండి కచ్చా డ్రైనేజీ ఏర్పాటు చేయడం వలన నిల్వ ఉన్న వర్షపు నీటిని మళ్లించవచ్చని అందువల్ల ఈ కచ్చా డ్రైనేజీ ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ చైర్పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్ తెలిపారు. సందర్భంగా తోటమూల ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుంచి బైపాస్ రోడ్డు చూజి కంపెనీ వరకు వర్షపు నీటిని తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన కచ్చా డ్రైనేజీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది,, వాటర్ వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు సత్కారం



**ఘంటసాల, మేజర్ న్యూస్:** కృష్ణాజిల్లా ఘంటసాల మండలంలోని పలు శాఖల్లో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారును ఘంటసాల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) ఆధ్వర్యంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ డి.సుబ్బారావు, ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుగుణ కుమారి లను దుశ్శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యండకుదురు ఎంపీటీసీ సిద్దినేని కుమార్ రాజా, మల్లాయి చిట్టూరు సర్పంచ్ ఆవుల రేవతి, యండకుదురు సర్పంచ్ ముళ్ళపూడి పట్టాభి రామారావు, టీడీపీ నాయకులు పాటిబండ్ల నరేష్, ఆవుల ధర్మ వెంకట నరసయ్య పాల్గొన్నారు.




## టొయోటా నుంచి రూమియన్ లిమిటెడ్ ఫెస్టివల్ ఎడిషన్

**విజయవాడ మేజర్ న్యూస్ :** కార్ల కొనుగోలుదారుల కోసం ఈ పండుగ సీజన్‌ను ప్రత్యేకంగా మలుస్తూ టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం), టొయోటా రూమియన్ ఫెస్టిక్ ఎడిషన్‌ను పరిచయం చేసింది. ప్రత్యేకమైన టొయోటా జెన్యూన్ యాక్సెసరీ ప్యాకేజీలను కలిగి ఉన్న ఈ లిమిటెడ్ ఎడిషన్ సీజన్‌ను చక్కగా, ఆకర్షణీయమైన శైలిలో జరుపుకోవడానికి సరైన మొబిలిటీ ఎంపికగా నిలుస్తుంది. రూమియన్ యొక్క ఈ పండుగ ఎడిషన్, అన్ని గ్రేడ్‌ల లో అందుబాటులో ఉంది. కస్టమర్లు ప్రీమియం అనుభవాన్ని ఆస్వాది స్తున్నారని నిర్ధారిస్తూ రూ. 20,608 విలువైన డీలర్ ఫిట్టెడ్ టిజిఎ ప్యాకేజీతో వస్తుంది. టొయోటా రూమియన్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ బుకింగ్‌లు ఇప్పుడు అన్ని టొయోటా డీలర్‌షిప్‌లలో, ఆన్‌లైన్‌లో తెరవబడ్డాయి.

## పండగ సందర్భంగా లైఫ్ స్టైల్ నుంచి కొత్త సేకరణ



**విజయవాడ మేజర్ న్యూస్ :** భారత దేశపు ప్రముఖ ఫ్యాషన్ గమ్యస్థానం లైఫ్ స్టైల్ అది ఈ పండగ వాతావరణానికి తగ్గట్టు వినూత్నమైన ఫ్యాషన్ నూతన శ్రేణిని ఆవిష్కరించింది. ఈ సందర్భంగా లైఫ్ స్టైల్ స్టోర్ మేనేజర్ శ్రీ మాట్లాడుతూ కొత్త ఫాషన్ పండుగ క్షణాలకు సరికొత్త శైలి అధునాతనతను తీసుకురావడానికి సెట్ చేయబడ్డాయన్నారు. లైఫ్ స్టైల్ యొక్క కొత్త పండగ కలెక్షన్ లో ప్రతి ఒక్కరికీ ఏదో ఒకటి ఉన్నాయని, సంప్రదాయ చక్కని ఎత్నిక్ దుస్తుల యొక్క కాలపరిమితి లేని ఆకర్షణ నుండి సమకాలీన పాశ్చాత్య శైలుల సొగసైన గ్లామర్ వరకు, ఈ కలెక్షన్ తీసుకొస్తుం దన్నారు. మహిళల పండుగ సేకరణ సంక్లిష్టమైన నమూనాలు, అధివాస్తవిక రంగులతో అలంకరించబడిన సొగసైన జాతి దుస్తుల ఎంపికల శ్రేణిని కుర్తాలు సెట్లు పగటి వేడుకలకు సరైనవి, సాంప్రదాయిక ఆధునిక సౌంద ర్యాన్ని కోరుకునేవారికి, ఈ కలెక్షన్ సమకాలీన బ్లాక్-ప్రింట్లు, అజ్రాఖ్-ప్రేరేపిత నమూనాలు, అనార్కలి వంటి సున్నితమైన ఛాయాచిత్రాలతో అలం కరించిన డిజైన్లు, స్ట్రెయిట్-ఫిట్స్, కుర్తా సెట్లు, ఆనందకరమైన వేడుకలకు సరైన ఎంపికను అందిస్తుందన్నారు. పాశ్చాత్య బట్టల గోల్డ్, ప్లాటినం డ్రెస్సులు, స్టైలిష్ టాప్స్ ఉన్న ఈ పీస్ లు, పురుషుల కలెక్షన్ లో సంప్రదాయ క్లాసిక్ తో వివిధ రేంజ్ ల కుర్తాలు, జాకెట్ లను అందిస్తుందన్నారు. వీటితోపాటు విభిన్న తరహా నూతన వస్త్రాల శ్రేణి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు.

# విద్యార్థులకు పోలీస్ అమరవీరుల సంస్మరణ అవగాహన సదస్సు




### నందివాడ ఎస్ఐ కే శ్రీనివాస్

**నందివాడ, మేజర్ న్యూస్:** పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళ వారం నందివాడ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ కె.శ్రీనివాస్ అధ్వర్యంలో శ్రీ వేములపల్లి నాగయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు, విద్యార్థులకు పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఎస్సై కె.శ్రీనివాస్. విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కొరకు పోలీస్ వ్యవస్థ కేసు దర్యాప్తు కొరకు ఉపయోగించే ఆయుధాలు, రక్షణ పరికరాలు గురించి వివరించారు. ఆయుధాలతోపాటు వాటి యొక్క విడిభాగాలు మెటల్ డిటెక్టర్, డ్రాగన్ లైట్, రాకెట్ లాంచర్, బాంబు డిస్పోజల్ వంటి పరికరాల గురించి విద్యార్థినీ విద్యార్థులకు వివరించడంతో పాటు పలురకాల రికార్డులను జిడి ఎంట్రీలను విద్యార్థులకు అవగాహన కలిగే రీతిలో వారికి వివరించారు. అనంతర పోలీస్ అమరవీరుల సేవల గురించి వారి యొక్క ప్రాణత్యాగాల గుర్చి విద్యార్థుని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారత్ చైనా సరిహద్దులోని లడక్ ప్రాంతంలో గల హాట్ స్ప్రింగ్ అనే ప్రదేశంలో 1959 అక్టోబర్ 21వ తేదీన సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు చైనా ముష్కరులు ఆకస్మికంగా దాడి చేసిన సంఘటనలో 10 మంది సిఆర్పిఎఫ్ జవానులు చివరి రక్తపు బొట్టు వరకు పోరాడి తమ ప్రాణాలను అర్పించారు. నాటి నుండి వారి త్యాగాలకు గుర్తుగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుంది. అసాంఘిక శక్తులతో పోరాడుతూ సమసమాజ నిర్మాణానికి అహర్నిశలు పాటుపడుతూ ఎంతోమంది పోలీసులు అమరులవుతున్నారని దేశంకోసం ఉన్నత చదువులు చదువుకొని సేవ చేయాలనే దృక్పథంతో ఉండాలన్నారు. ఇప్పటినుంచి సమాజంలో మత్తు పదార్థాలకు, అసాంఘిక కార్యకలాపాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై కె.శ్రీనివాస్ పేర్కొన్నారు.



# పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**బంటుమిల్లి మేజర్ న్యూస్:** విధి నిర్వహణలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివిని స్థానిక ఎస్సై గణేష్ కుమార్ అన్నారు. ఈనెల 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కృష్ణా జిల్లా ఎస్.పి. ఆర్.గంగాధర్ రావు ఆదేశాల మేరకు మంగళవారం బంటుమిల్లి పోలీస్ స్టేషన్ లో వాగ్దేవి కళాశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ ప్రదర్శన కార్యక్రమం పై ఎస్సై గణేష్ కుమార్ అవగాహన కలిగించారు. పోలీస్ వ్యవస్థలో ఉపయోగించే ఆయుధాలు, రక్షణ పరికరాలు వాటి యొక్క విడిభాగాలు, సాంకేతిక పరికరాలు గురించి వివరించారు. డయల్ 100, 112 పని చేయు విధానం పోలీస్ యొక్క ముఖ్య విధులు పోలీస్ యూనిఫామ్ పై వారి ర్యాంకులు, గ్యాంబ్లింగ్, ఫోక్సో, ర్యాగింగ్ తదితర చట్టాల గురించి వివరించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్,చట్టాలు, శిక్షలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రిసెప్షన్ వ్యవస్థ, కేస్ డైరీ,జీడి, స్టేషన్ లాకప్, వైర్లెస్ సెట్ పై విద్యార్థులకు క్షుణంగా వివరించారు.

# జాబ్ మేళాకు మంచి స్పందన



**పెడన, మేజర్ న్యూస్ :** బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించిందని సుమారు 143 మంది హాజరు అవగా 13 మంది ఎంపికయ్యారని 34 మంది తదుపరి ఇంటర్వ్యూ కొరకు అర్హత సాధించారని జిల్లా వృత్తి విద్యా కళాశాలల అధికారి పిబి.సాల్మన్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా పది నుండి డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించుటకు 5 కంపెనీలు హాజరయ్యాయని నిరుద్యోగ యువత చదువుతో పాటు ఇతర నైపుణ్యాలపై కూడా దృష్టి సారించి తదనుగుణంగా శిక్షణ పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ రూప నాగశ్రీ, యంగ్ ఇండియా ప్రొఫెషనల్ ప్రతినిధి జయరాజు, కళాశాల లెక్చరర్ నాగరవి, గిరి, గంగాధర్ స్కిల్‌డెవలప్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.



# గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ అమెరికా పర్యటన



**గన్నవరం, అక్టోబర్ 22, మేజర్ న్యూస్ :** గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వ్యక్తిగత పనుల నిమిత్తం అమెరికా పర్యటనకు వెళ్లారు. శంషాబాద్ విమానాశ్రయం నుండి మంగళవారం సాయంత్రం అమెరికా బయలుదేరి వెళ్లారు. ఎన్ఆర్ఐ అయిన యార్లగడ్డ వెంకట్రావు అమెరికాలోని వ్యాపార కార్యకలాపాల నిమిత్తం తరచూ అమెరికా వెళ్లి వస్తుండేవారు. గత ఏడాది జులై నెల లో అమెరికా వెళ్లెందుకు సన్నద్ధం కాగా రాజకీయ కార్యకలాపాల కారణంగా వెళ్లలేకపోయారు. తదనంతరం టిడిపిలో చేరిన ఆయన అమెరికా వెళ్ళేందుకు పలుమార్లు ప్రయత్నించినా పార్టీ కార్యకలాపాల్లో బిజీ ఉండడంతో వెళ్లలేకపోయారు. గత ఏడాది ఆగష్టులో లోకేష్ యువగళం పాదయాత్రలో తనతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలపై అప్పటి ప్రభుత్వం కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతుండటంతో ఆయన పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, వారికి ధైర్యం చెపుతూ, కేసుల్లో వున్నవారికి అండగా ఉండి ఆర్థిక, న్యాయ సహాయం అందిస్తూ ఇక్కడే ఉండిపోయారు. తదుపరి ఎన్నికలు రావడంతో ఎన్నికల్లో బిజీగా ఉండి అమెరికా వెళ్ళలేకపోయారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన అనంతరం అమెరికా వెళ్లేందుకు సన్నద్ధం కాగా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది బదిలీలు, నియోజవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల్లోపడి అమెరికా వెళ్లేందుకు వీలు చిక్కలేదు. గత నెలలో భారీ వర్షాలు, వరదల కారణంగా వరద బాధిత ప్రాంతాలు పర్యటిస్తూ వరద బాధితుల కు పునరావాస కార్యక్రమాలతో పూర్తి బిజీగా గడిపారు. గత 17నెలలుగా అమెరికా పర్యటన వాయిదా పడుతున్న నేపథ్యంలో అక్కడి వ్యాపార పనులు చూసుకునేందుకు మంగళవారం సాయంత్రం శంషాబాద్ నుండి డల్లాస్ కు బయలుదేరి వెళ్లారు. యార్లగడ్డ తన అమెరికా పర్యటనలో వారం రోజులపాటు వ్యాపార కార్యకలపాల్లో పాల్గొంటారు. మరో వారం రోజులు మంత్రి నారా లోకేష్ తోపాటు ఐటీ సంస్థల ప్రతినిధులతో చర్చల్లోనూ, ఐటీ సదస్సుల్లో పాల్గొంటారు. యార్లగడ్డ అమెరికా పర్యటన ముగించుకుని వచ్చేనెల 5 వ తేదీ భారత్ కు తిరిగివస్తారు. అమెరికా పర్యటనకు వెళుతున్న యార్లగడ్డ వెంకట్రావు గన్నవరం నియోజకవర్గ ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా పార్టీ కార్యాలయంలో తగు ఏర్పాట్లు చేశారు. కార్యాలయంలో నిరంతరాయంగా ప్రజలకు సాయం చేసేందుకు గన్నవరం క్యాంప్ కార్యాలయం లో 12 మంది వ్యక్తిగత సిబ్బందిని, నలుగురు వ్యక్తిగత సహాయకులు (పి.ఏ)లను, పార్టీ నాయకుల్ని అందుబాటులో ఉంచారు. నియోజకవర్గ ప్రజలకు ఏ అవసరం వచ్చినా తన కార్యాలయం లో సంప్రదించాలని యార్లగడ్డ సూచించారు.



## వెంకట ప్రసాద్ కుటుంబ సభ్యులకు పరామర్శ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఇటీవల కరెంట్ షాక్‌కు గురై మరణించిన జనసైనికుడు మాదివాడ వెంకటప్రసాద్(45) కుటుంబ సభ్యులను జనసేన టౌన్ ప్రెసిడెంట్ రాజనాల వీరబాబు మంగళవారం పరామర్శించారు. మండల పరిధిలోని వేకనూరు గ్రామపంచాయతీ శివారు గుడివాకవారి పాలెం గ్రామానికి చెందిన వెంకటప్రసాద్ ఈనెల 7న ఇంటి వద్ద ఉన్న చావిడిని బాగు చేసే క్రమంలో పక్కగా వెళ్తున్న సర్వీస్ వైరు తెగి పడటం వలన విద్యుత్ షాక్ కు గురై మరణించగా మృతుని భార్య లక్ష్మి మాట్లాడుతూ తన భర్త కరెంట్ షాక్ తో చనిపోయిన విషయాన్ని పోలీసులకు తెలియపరిచామని వారు కంప్లైంట్ రిజిస్టర్ చేసి బాడీని అవనిగడ్డ గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించి పోస్టుమార్టం నిర్వహించారని తెలియజేశారు. మృతి చెందిన ప్రసాద్ కు భార్య కుమార్తె కుమారుడు,తల్లి ఉన్నారు. ఆదారం కోల్పోయిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వీరబాబు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని కూటమి నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. నవంబర్ 6 తొ నమోదు గడువు ముగియనుండటంతో త్వరితగతిన నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గాజుల శంకరరావు, వీర మహిళలు బచ్చు కృష్ణ కుమారి, మత్తి శివ పార్వతి,తెలుగు మహిళ బండే కనకదుర్గ చంద్రశేఖర రావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కేయూకు 'నాక్' బృందం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జాతీయ అసెస్మెంట్, అక్రిడేషన్ బృందం ఈ నెల 23 వ తేదీన బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయం కు రానుందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడురోజుల పాటు నాక్ బృందం విశ్వవిద్యాలయంలో అన్ని విభాగాలను క్షుణంగా పరిశీలించి, ఆయా విభాగాల ఇన్చార్జి, సమన్వయకర్తలు నుండి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మరిన్ని వివరాల తెలుసుకుంటుందని ఆయన తెలియచేసారు. తదనంతరం నైపుణ్యాభివృద్ధి ముదింపు ప్రక్రియ చేపట్టి, ర్యాంకింగ్ కేటాయించేందుకు తుది నివేదికను తయారు చేస్తారని ఆయన తెలిపారు. విశ్వవిద్యాలయం స్థాపించిన తర్వాత తొలిసారి నాక్ బృందం పర్యటిస్తుండడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## బంగారు బందరు కార్యక్రమం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మంగళవారం బంగారు బందరు కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం మండలంలోని కానూరు గ్రామ పంచాయితీలో శ్రమదానం నిర్వహించిన కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ గోపు సత్యనారాయణ. ఆనంతరం ఆయన మాట్లాడుతూ మలేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలి అని, మురికి నీరు నిలువకుండా చూసుకోవాలి అని, వేడి నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దివి మహేష్,గోపు వెంకటరమణ,బొలిశెట్టి నాని, ఈవన వెంకన్న, వంకా కాశీ,బొట్ల రాజేష్,వంకా నందేశ్వరరావు, గోపు కనక పెద్దిరాజులు,మరీదు రాఘవరావు, గుళ్లపల్లి శరత్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ డ్రోన్ రాజధానిగా ఏపీని తీర్చిదిద్దుతాం





ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులో డ్రోన్ హబ్ కోసం 300 ఎకరాలు కేటాయిస్తాం.

రాష్ట్రంలో 35 వేల మంది డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇవ్వాలన్నది మా లక్ష్యం

నాలెడ్జ్ ఎకానమీలో డ్రోన్ సదస్సు గేమ్ ఛేంజర్

డేటా సరికొత్త సంపద. ఏఐ, మెషీన్ లెర్నింగ్‌లతో అనుసంధానంతో విప్లవాత్మక మార్పులు.

నిపుణులు, పారిశ్రామికవేత్తల సూచనలు తీసుకొని 15 రోజుల్లోనే డ్రోన్ పాలసీని ఆవిష్కరిస్తాం

2047 నాటికి ఒక కుటుంబం...ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్నది నా అభిమతం.

డ్రోన్ సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా అమరావతి డ్రోన్ సమ్మిట్ నిర్వహించడం సంతోషంగా ఉందని.. ఇది భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీలో గేమ్ ఛేంజర్ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్స్‌లో కేంద్ర పౌర విమానయాన శాఖ, ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అమరావతి డ్రోన్ సమ్మిట్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రివర్యులు బీసీ జనార్ధన్ రెడ్డి తదితరులతో కలిసి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...1995లో నేను ఐటీ విధానం గురించి మాట్లాడితే ఆరోజు ఆ మాటలు కొందరికి అర్థం కాలేదని.. సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఐటీ రంగాన్ని అడ్వాంటేజ్‌గా తీసుకుని పెద్ద ఎత్తున ప్రమోట్ చేసినట్లు తెలిపారు. బెంగళూరులో ఉన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అక్కడ ఐటీ కంపెనీల ఏర్పాటుకు గతంలో పరిస్థితులు అనుకూలంగా ఉండేవని.. తాను వివిధ ఐటీ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి హైదరాబాద్‌కు ఐటీ పరిశ్రమలు తెచ్చేందుకు కృషిచేశానన్నారు. వాటి ఫలితమే నేడు హైదరాబాద్ ఐటీ రంగంలో అభివృద్ధి పథంలో నడుస్తోందని తెలిపారు. పీపీపీ విధానంలో హైటెక్ సిటీని నిర్మించినట్లు తెలిపారు. ఆ సమయంలో అమెరికాలో 15 రోజులు పాటు పర్యటించి అనేక మంది ఐటీ నిపుణులతో సంప్రదించి ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఇంకా ఏమన్నారంటే..

- నాడు నేను ఒకటే చెప్పా... టెక్నాలజీలో ఇండియా బలమైన దేశమని. బ్రిటిష్ వారు మన దేశాన్ని వదిలివెళ్లేటప్పుడు దేశ సంపదతో పాటు కోహినూర్ వజ్రాన్ని తీసుకెళ్లారు. అయితే ఇంగ్లీష్‌ను వదిలివెళ్లారు.
- నేడు ప్రపంచంలోనే ఇంగ్లీష్ మాట్లాడేవారు ఇండియాలోనే ఎక్కువ మంది ఉన్నారు. గణితంలోనూ ఇండియా వారు బలమైనవారు. సున్నాను కనిపెట్టింది కూడా ఇండియా వారే.
- బిల్ గేట్స్‌ను కూడా గతంలో హైదరాబాద్ కు ఆహ్వానించి ఇక్కడి పరిస్థితులు వివరించాం. టెలీ కమ్యూనికేషన్‌లో డీ రెగ్యులేషన్ గురించి నాటి ప్రధాని వాజ్‌పేయ్ ని ఒప్పించాం. సెల్ ఫోన్ అన్నం పెడుతుందా అంటూ వెకిలిగా మాట్లాడారు. ఐటీ రంగంలో భారతీయులు బలమైనవారు. బయో టెక్నాలజీ, ఫార్మాలో భారతీయులు సమర్థవంతులు.
- టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో తెలుగు ప్రజలు ఎప్పుడూ ముందుంటారు. అడ్వాన్స్ డ్రోన్స్, సీసీటీవీ కెమెరాలు, యాప్‌లు, ఇతర టెక్నాలజీ పరికరాల వినియోగంలో ముందున్నాం. ఐటీ గురించి మాట్లాడిన సందర్భంలో ఉద్యోగాలు చేయడమే కాదు...ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వెళ్లాలని చెప్పాను.
- ప్రపంచంలో భారతీయులు ఎక్కువ తలసరి ఆదాయం పొందుతున్నారు. అందులో తెలుగువారు 30 శాతం మంది ఉన్నారు.
- విమాన సదుపాయం లేని సమయంలో ఢిల్లీ, ముంబైలో దిగి హైదరాబాద్ రావాలని చెప్పాను. వ్యాపారాలు చూసుకుని వెళ్లండని కోరాను...దానికి కారణం హైదరాబాద్‌కు నాడు సరైన విమాన సదుపాయం లేకపోవడమే.
- నాటి ప్రధాని వాజ్‌పేయిని ఒప్పించి ఓపెన్ స్కై పాలసీ తెచ్చేలా కృషి చేశాం. అప్పుడు మొదటి సారి ఎమిరేట్స్ నుండి హైదరాబాద్ విమానం నడిచింది. ఆ సమయంలోనే గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు శ్రీకారం చుట్టాం. 32 సార్లు ప్రధానమంత్రి, విమానయాన శాఖ అధికారులతో చర్చించాం.
- గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణం తర్వాత హైదరాబాద్ కు ఔటర్ రింగ్ రోడ్, బయోటెక్నాలజీ పార్క్, ఐటీ, ఫార్మా రంగాల్లో పెద్ద సంస్థలను తీసుకొచ్చాం. ఇప్పుడు దేశంలోనే హైదరాబాద్ బెస్ట్ నివాసయోగ్య సిటీ అని గర్వంగా చెప్తుకుంటున్నాం.
- మన దేశానికి ఒక డైనమిక్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉన్నారు. ఇండియన్ బ్రాండ్ ను ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్నారు. వికసిత్ భారత్ 2047 ద్వారా ఇండియాను ప్రపంచంలో నెంబర్ 1 లేదా నెంబర్ 2 స్థానంలో ఉంచడానికి ప్రయత్నం చేస్తున్నారని నేను బలంగా నమ్ముతున్నాను.
- నేడు ప్రపంచంలోనే డిజిటల్ కరెన్సీని ఎక్కువగా ఉపయోగించేది ఇండియన్స్. జన్ ధన్, ఆధార్ మొబైల్ (జామ్) అనుసంధానం చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టారు.
- రాబోయే కాలం అంతా డేటాదే. ఎంత డేటా ఉంటే దేశానికి, పెట్టుబడిదారులకు అంత బాగుంటుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) ద్వారా నిర్దిష్టమైన సమాచారాన్ని పొందవచ్చు. డ్రోన్స్ ను మనం ఎక్కడికైనా పంపవచ్చు...సరైన సమాచారాన్ని పొందవచ్చు.
- ఇటీవల విజయవాడలో పెద్దఎత్తున వరదలు వచ్చాయి. ఆ సమయంలో బాధితులకు ఆహారం కలుషితం కాకుండా, వృధా కాకుండా అందించడానికి దేశంలోనే మొదటిసారిగా డ్రోన్లు వినియోగించి బాధితులకు ఆహారం అందించాం. హెలికాప్టర్ల ద్వారా ఆహారం అందించిన సందర్భంలో పైనుంచి వేయడంతో ఆహార పొట్లాలు పగిలిపోయేవి. కానీ.. డ్రోన్ల ద్వారా సురక్షితంగా 1.50 లక్షల మందికి ఆహారం అందించాం.
- అంతేకాదు డ్రోన్లు సిటీలోకి పంపి ఎంత చెత్త ఎక్కడ పేరుకుపోయిందో కూడా సర్వే చేశాం. సరైన సమయంలో అన్నింటిని గుర్తించి 20 మెట్రిక్ టన్నుల చెత్తను నాలుగు రోజుల్లోనే తొలగించాం. రోడ్లు ఎక్కడ సరిగా లేకపోయినా డ్రోన్లు పంపి సమాచారం తెప్పించాం. ఏ రోడ్డు పక్కన చెత్త ఉన్నా పరిశీలించి శుభ్రం చేయించాం. వరద నీరు బయటకు పోవడానికి కారణం డ్రెయిన్లు మూసుకుపోవడమని.. బ్లాక్‌లను గుర్తించి, వాటిని తొలగించి నీటిని బయటకు పంపాం.
- భవిష్యత్తులో డ్రోన్లు గేమ్ ఛేంజర్లుగా చెప్పొచ్చు. వ్యవసాయం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితరాల్లో వాటిని వినియోగించవచ్చు.
- విజిబుల్ పోలీసింగ్...ఇన్ విజిబిల్ పోలీస్ కు ప్రాధాన్యమిస్తున్నాం. టెక్నాలజీ సహాయంతో నేరగాళ్ల ఆటకట్టిస్తాం. ప్రతి అంశంలోనూ ఖచ్చితత్వాన్ని సాధించడంతో పాటు చివరి మైలు వరకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడంలో టెక్నాలజీని వినియోగించుకుంటాం.
- భూసార పరీక్షలు, పురుగుమందుల పిచికారీ, భూ సర్వే, భూసార పరీక్షలు తదితరాలను డ్రోన్ల ద్వారా నిర్వహించవచ్చు. కనీసం 100 నుండి 150 వరకు డ్రోన్ అప్లికేషన్స్ (డ్రోన్ యూజ్ కేస్‌లు) వినియోగం లక్ష్యంగా పనిచేస్తున్నాం. అప్లికేషన్స్‌ను క్షేత్రస్థాయిలో పరీక్షించి ఆయా కంపెనీలకు సరైన విధంగా ఫీడ్‌బ్యాక్ ఇచ్చేలా పైలట్ ప్రాజెక్టులకు వీలుకల్పిస్తాం.
- నాకు కావాల్సింది డ్రోన్ల ద్వారా అభివృద్ధి. ఇండియా కు రెండంకెల వృద్ధిరేటు సాధించే సత్తా ఉంది. నాలెడ్జ్ ఎకానమీలో గ్లోబల్ సర్వీస్‌లు అందించగల సత్తా కూడా మన దేశానికి ఉంది.
- పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, విద్యావేత్తల నుండి సలహాలు, సూచలను తీసుకుని డ్రోన్ పాలసీని ప్రవేశపెడతాం. 15 రోజుల్లోనే డ్రోన్ పాలసీని ఆవిష్కరిస్తాం. కనీసం 35 వేలకు పైగా డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. డ్రోన్ సిటీ ఆఫ్ ఇండియాగా అమరావతిని తీర్చిదిద్దుతాం.
- ఏఐ, ఎమ్ఎల్.. ప్రతి ఒక్కరి జీవితాలను ప్రభావితం చేస్తాయి. మీ అందరికీ ఒక సూచన ఇస్తున్నా...థింక్ గ్లోబల్లీ.. యాక్ట్ గ్లోబల్లీ విధానాన్ని అనుసరించాలి.
- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులో డ్రోన్ హబ్ కోసం 300 ఎకరాలు కేటాయిస్తాం. అక్కడ డ్రోన్ హబ్ ఏర్పాటు చేస్తే పెద్ద నగరాలైన హైదరబాద్, చెన్నై, బెంగళూరు, అమరావతికి దగ్గరగా ఉంటుంది. అక్కడ డ్రోన్ మ్యానుఫ్యాక్చరింగ్ కు సహకారం అందించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం.
- నేను డ్రోన్లు తయారీదారులకు కూడా చెప్తున్నా....మీకు నేను అంబాసిడర్ గా ఉంటాను....మీ మార్కెట్ ను ప్రమోట్ చేస్తా. నేను చాలా మంది ప్రధానులను చూశాను కానీ టెక్నాలజీని ఇంతగా అర్థం చేసుకునే వ్యక్తి ప్రధాని మోదీ. స్నేహపూర్వక వాతావరణంలో విధానాల రూపకల్పనకు సిద్ధంగా ఉన్నాం.
- స్టూడెంట్స్, టీచర్స్, ప్రొఫెసర్స్ కు కూడా చెప్తున్నా నాలెడ్జ్ ఎకానమీకి ఇది మంచి సమయం. ప్రతిదీ అదుబాటులో ఉంది. ప్రతి దాన్ని ఎలా వినియోగించుకోవాలో ఆలోచిస్తే ఇండియన్స్ ను ఎవరూ ఎదుర్కోలేరు. నేడు మన దేశం యువ జనాభా తద్వారా యంగ్ టాలెంట్‌తో తొణికిసలాడుతోంది.
- కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం, రాష్ట్రంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా టెక్నాలజీ, ఇన్నోవేషన్ లో భాగస్వాములవుతున్నారు. సమష్టి భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని డ్రోన్ హబ్‌గా మారుస్తాం.
- రాష్ట్రంలోని యూనివర్సిటీలు కూడా థియరిటికల్ విద్యకే కాకుండా అప్లికేషన్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. నవ టెక్ ఆవిష్కరణలు దిశగా యువతను ప్రోత్సహించాలి. రాష్ట్రంలో 5 రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లు ఏర్పాటు చేస్తున్నాం.అమరావతిలో హెడ్ క్వార్టర్ ఉంటుంది.. మిగతావి విశాఖ, రాజమండ్రి, తిరుపతి, అనంతపురంలో ఏర్పాటు చేస్తున్నాం. 2047 నాటికి ఒక కుటుంబం...ఒక వ్యాపారవేత్త ఉండాలన్నది నా అభిమతం.
- 25 ఏళ్ల క్రితం ప్రతి కుటుంబంలో ఒక ఐటీ వ్యక్తి ఉండాలని ఆకాంక్షించాని.. అదే విధంగా ఇప్పుడు చెప్తున్నా ఒక కుటుంబంలో ఒక వ్యాపారవేత్త, ఒక స్టార్టప్ కంపెనీ ఉండాలని చెప్తున్నా. ఇది సక్సెస్ అయితే భారత్.. టెక్నాలజీ, గ్లోబల్ సర్వీసెస్‌లో ముందుంటుంది.







# ఏపీఎస్డీఆర్ఎఫ్ బలోపేతం దిశగా అడుగులు

**ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం**

**ఉత్తరాంధ్రలో త్వరలో భారీ వర్షాల నేపథ్యంలో ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాం**

**ఏపీవిపత్తునిర్వహణ సంస్థ కార్యాలయంలో హోం మంత్రి సమీక్ష**

**మంగళగిరి సీకే కన్వెన్షన్ లో జరిగిన డ్రోన్ సమ్మిట్ దేశంలోనే తొలిసారి**

**ఏపీఎస్డీఆర్ఎఫ్ బలోపేతం దిశగా అడుగులు**

**హోం మంత్రి వంగలపూడి అనిత**

విజయవాడ, మేజర్ న్యూస్ : ఏపీఎస్డీఆర్ఎఫ్ బలోపేతం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఏపీ విపత్తు నిర్వహణ సంస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో హోం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విపత్తుల సమయంలో అత్యవసర సహాయక చర్యల్లో పాల్గొనే ఏపీ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సెస్ (ఏపీఎస్డీఆర్ఎఫ్) బృందాల పటిష్టతకు కృషి చేస్తామన్నారు. మారుతున్న పరిస్థితులను బట్టి ఎస్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందికి ప్రతి సంవత్సరం కనీసం 5 సార్లకు తగ్గకుండా వరదలు, తుపానులు, రసాయన ప్రమాదాలు, అగ్ని ప్రమాదాల వంటి అంశాలపై అత్యాధునికి సాంకేతిక శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆమె ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ ను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఆపదమిత్ర వాలంటీర్లకు శిక్షణ ఇచ్చి విపత్తుల వేళల్లో వారి సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకునేందుకు దిశానిర్దేశం చేశారు. సహాయక చర్యల సమయంలో వినియోగించే కొత్త సాంకేతిక పరికరాల జాబితా అందిస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి ఏర్పాటు చేస్తామన్నారు. విడతల వారీగా వాటిని కొనుగోలు చేసి అందుబాటులోకి తెచ్చి ప్రమాదాల సమయంలో నష్టనివారణ చర్యలు వేగంగా జరిగేలా సమిష్టిగా కృషి చేద్దామన్నారు. తద్వారా ప్రాణ నష్టాన్ని తగ్గించడమే కాకుండా, సహాయక చర్యలకు పట్టే సమయాన్ని చాలా వరకు తగ్గించడం సాధ్యమవుతుందన్నారు. ఉత్తరాంధ్రలో ఈ నెల 24 నుంచి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేసినట్లు స్పష్టం చేశారు. అత్యవసర సహాయ చర్యల కోసం ఎస్డీఆర్ఎఫ్ ఆరు బెటాలియన్లలోని 600 మంది సభ్యులతో కూడిన 12 బృందాలు సంసిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లకుండా వర్ష ప్రభావమున్న ప్రాంతాలను ఎప్పటికప్పుడు విపత్తు నిర్వహణ సంస్థ ద్వారా అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, ఏపిఎస్డీఎంఏ ఎండీ రోణంకి కూర్మనాథ్, ఎస్డీఆర్ఎఫ్ డీఐజీ రాజకుమారి, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ వివిఎన్ ప్రసన్న, ఏపీ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ డి.మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



**సీఎం చంద్రబాబు దార్శనికతలో డ్రోన్ కేపిటల్ గా అమరావతి : హోం మంత్రి వంగలపూడి అనిత**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో అమరావతి డ్రోన్ కేపిటల్ గా నిలుస్తుందని హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరి సీకే కన్వెన్షన్ లో జరిగిన 'అమరావతి డ్రోన్ సమ్మిట్-2024' పేరిట జరిగిన కార్యక్రమం దేశంలోనే తొలిసారి అని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత సైతం భాగస్వామ్యమయ్యారు.

# గ్లోబల్ డ్రోన్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్



**వరదల సమయంలో డ్రోన్ల వినియోగం సరికొత్త విప్లవం..**

**1996లోనే విజన్-2020 దిశగా ఆలోచించిన దార్శనికుడు చంద్రబాబు..**

**సమైక్యాంధ్రలో చంద్రబాబు చర్యల వల్లే వరల్డ్ క్లాస్ సిటీగా హైదరాబాద్..**

**సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోదీ..**

**రాబోయే 20 ఏళ్లలో 200కు పైగా విమానాశ్రయాలు..**

**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**

విజయవాడ, మేజర్ న్యూస్ : సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోదీతో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి.. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఉపయోగపడుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళగిరి సి.కె. కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విజనరీ డైనమిక్ లీడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని.. ప్రపంచ డ్రోన్ హబ్ గా ఏపీ ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ వరదల సమయంలో డ్రోన్ల వినియోగంతో అత్యవసర సేవలు అందించడం సరికొత్త విప్లవమని తెలిపారు. రాష్ట్రంలో ఎయిర్ కనెక్టివిటీని పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని.. దేశవ్యాప్తంగా అందరూ నేడు అమరావతి వైపే చూస్తున్నారన్నారు.

**ఏపీలో తొలిసారిగా డ్రోన్ సమ్మిట్-2024**

ఢిల్లీ తర్వాత అమరావతిలోనే డ్రోన్ సమ్మిట్-2024 నిర్వహించడం జరుగుతోంది. రెండ్రోజులపాటు నిర్వహించే డ్రోన్ సమ్మిట్‌ను గ్రాండ్ ప్రారంభించడమే గాక దేశానికే అమరావతిని డ్రోన్ కేపిటల్ గా చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్న ఏపీకి ధన్యవాదాలు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1996 లోనే సీఎం చంద్రబాబు విజన్-2020 తీసుకొచ్చారు. ఇప్పుడు డ్రోన్ల సద్వినియోగంలోనూ అదే దూరదృష్టితో ముందుకెళ్తున్నారు. చంద్రబాబు ఎప్పుడూ భావితరాల భవిష్యత్ గురించే ఆలోచిస్తారు.

**చంద్రబాబు నిర్ణయాల వల్లే వరల్డ్ క్లాస్ సిటీగా హైదరాబాద్**

సమైక్యాంధ్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాల వల్లే హైదరాబాద్ వరల్డ్ క్లాస్ సిటీగా ఆవిర్భవించింది. చంద్రబాబు యువతరానికి ఒక మార్గదర్శి అయితే నాకు ఒక మెంటర్‌గా ఉన్నారు. 36 ఏళ్లకే నన్ను కేంద్ర కేబినెట్‌కి పంపించారు. యువతని ప్రోత్సహించడంలో సీఎం చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారనేందుకు ఇదే ఒక మంచి ఉదాహరణ. 1996లో చంద్రబాబు హైదరాబాద్ గురించి ఎలా మాట్లాడారో ఇప్పుడు అదే జీల్‌తో డ్రోన్ గురించి మాట్లాడుతున్నారు.

**20 ఏళ్లలో 200కు పైగా విమానాశ్రయాలు**

అదేవిధంగా దేశాభివృద్ధికోసం నిరంతరం ఆలోచించే వ్యక్తి ప్రధాని మోదీ. ఏ దేశం వెళ్లినా భారత్ గురించి, మోదీ పాలనలో సాధించిన డెవలప్ గురించి మాట్లాడుతున్నారు. పదేళ్ల క్రితం 74గా ఉన్న ఎయిర్ పోర్టుల సంఖ్యను 150కి పైగా పెంచారు. రాబోయే 20 ఏళ్లలో 200కు పైగా విమానాశ్రయాలు వస్తాయి.

ప్రయాణికుల సంఖ్యను బట్టి ఎయిర్‌పోర్టులు, విమానాలు పెంచుతాం. డ్రోన్ నిబంధనలను కేంద్రం సులభతరం చేసింది. డ్రోన్ స్టార్టప్‌లను, యువత పాత్రను కేంద్రం ప్రోత్సహిస్తోంది.

**చంద్రబాబు చొరవ వల్లే డ్రోన్ సమ్మిట్**

ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో డ్రోన్ల టెక్నాలజీ పెరిగింది. నేడు ఎకనమిక్, ఫిజికల్ స్థితిగతులను డ్రోన్స్ మారుస్తున్నాయి, మ్యానుఫ్యాక్చరింగ్ తదితర కీలక రంగాల్లో ఇప్పటికే మార్పులు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో చంద్రబాబు చొరవతోనే అమరావతిలో డ్రోన్ సమ్మిట్ నిర్వహిస్తున్నారు. సరికొత్త సాంకేతికతను వాడుకోవడం గురించి సీఎం నిత్యం చర్చలు జరుపుతుంటారు. తాను కేంద్రమంత్రి అయ్యాక చాలామంది ముఖ్యమంత్రులు ఎయిర్‌పోర్టులు, హెలిపోర్టుల గురించి అడిగారు. కానీ ఎయిర్‌పోర్టులతో పాటు కనెక్టివిటీ, డ్రోన్‌ల ప్రాధాన్యం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు.

**ఏపీలో బెస్ట్ పాలసీ**

డ్రోన్‌లో వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానం వచ్చింది. ఇలాంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీకి తేవాలని చంద్రబాబు ఆలోచిస్తున్నారు. అందుకే.. డ్రోన్ టెక్నాలజీ నిపుణులు ముందుకు రావాలని.. ఇక్కడ నిర్మాణాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. డ్రోన్ దీదీ ప్రోగ్రాం ద్వారా దేశంలో మహిళలకు ఉపాధి కూడా కలుగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు అందరితో మాట్లాడి పాలసీ రూపొందిస్తోందని.. కాబట్టి బెస్ట్ పాలసీ అవుతుంది కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కృష్ణా తీరంలో డ్రోన్ షో..







విజయవాడ, మేజర్ న్యూస్ :జాతీయ డ్రోన్ సమ్మిట్‌లో భాగంగా విజయవాడలోని పున్నమి ఘాట్ దగ్గర ఏర్పాటు చేసిన డ్రోన్ షోను ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. దేశంలోనే తొలిసారి 5,500 డ్రోన్లతో భారీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. సందర్శకులు భారీగా తరలిరావడంతో కృష్ణాతీరం జనసంద్రంగా మారింది. విజయవాడ నగర వాసులు డ్రోన్ షో వీక్షించేలా ఐదు ప్రాంతాల్లో డిస్ ప్లేలు ఏర్పాటు చేశారు. డ్రోన్ లైటింగ్ ద్వారా ఆకాశంలో వివిధ ఆకృతులు ప్రదర్శించారు. 1911 నాటి పోస్టల్ స్టాంప్ ఆకృతి కనువిందు చేసింది. గౌతమబుద్ధుడు, విమానం, ప్రపంచపటంపై భారతదేశం మ్యాప్ ఆకృతిలో డ్రోన్ల ప్రదర్శన ఆకట్టుకుంది. కళ్లు మిరుమిట్లు గొలిపేలా బాణసంచా వెలుగులతో పాటు 'కృష్ణం వందే జగద్గురం' కళా ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.. రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. డ్రోన్ హ్యాకథాన్‌లో విజేతలకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నగదు నజరానా అందజేశారు. ఐదు గిన్నిస్ రికార్డులతో అమరావతి డ్రోన్ షో చరిత్ర సృష్టించింది. ఈ మేరకు గిన్నిస్ బుక్ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు ధ్రువపత్రాలు అందించారు. లార్జెస్ట్ ప్లానెట్ ఫార్మేషన్, లార్జెస్ట్ ల్యాండ్ మార్క్ సృష్టికి, లార్జెస్ట్ ప్లేన్ ఫార్మేషన్, డ్రోన్ల ద్వారా అతిపెద్ద జెండాప్రదర్శన, ఏరియల్ లోగోతో మొత్తం ఐదు ప్రపంచ రికార్డులు నమోదయ్యాయి.

# ముంపు సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి

## ముంపు పంట భూములను పరిశీలించిన యువనాయకులు వెంకట్రామ్





**కోడూరు, మేజర్ న్యూస్ :** ముంపు సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తున్నారని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. మంగళవారం కోడూరు మండలం ఉల్లిపాలెం, హంసలదీవి, పాలకాయతిప్ప, రామకృష్ణాపురం, ఊటగుండం, దింటిమెరక గ్రామాల్లో ముంపునకు గురైన పంట భూములను వెంకట్రామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మైనర్ డ్రైనేజీలు పూడిక తీయించాలని, ఔట్ ఫాల్ స్లూయిజుల షెటర్లు బాగు చేయించాలని రైతులు కోరారు. సముద్రపు నీటి మట్టం పెరిగి ఉప్పునీటి చొరబాటు పెరగడంతో పాటు, ఆక్వా రైతుల తూముల ద్వారా ఉప్పునీరు మాగాణి భూముల్లో పెరిగి ముంపు ఏర్పడుతోందని రైతులు తెలిపారు. రత్నకోడు మేజర్ డ్రైనేజీపై అక్రమ తూములు, న్యూ ఇరాలి డ్రైనేజీపై అక్రమ వలకట్లు తొలగించాలని రైతులు కోరారు. ఇరాలి డ్రైనేజీపై పూడిపోయిన యూటీ పునరుద్దరణతో పాటు తక్షణ పరిష్కారంగా తూములు వేయించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ అక్రమ తూములు, అక్రమ వలకట్లు తొలగించాలని అధికారులను కోరారు. నియోజకవర్గంలో అన్ని ఔట్ ఫాల్ స్లూయిజులు నూతనంగా నిర్మించి సమస్య శాశ్వతంగా పరిష్కారం చేసేందుకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కృషి చేస్తున్నారని తెలిపారు. తక్షణ పరిష్కార చర్యల ద్వారా రైతులకు నష్ట నివారణ చర్యలు కూడా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కోడూరు మండల అధ్యక్షులు మర్రె గంగయ్య, రామకృష్ణాపురం సర్పంచ్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, హంసలదీవి మాజీ సర్పంచులు విజ్జినేని శివాజీ, కొక్కిలిగడ్డ సముద్రాలు, సర్పంచ్ కొక్కిలిగడ్డ బిక్షాలు, ఇరిగేషన్ ఏఈ దోవారి విజయ్ కుమార్, ఆర్.సీ ఏఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, కోడూరు పట్టణ జనసేన అధ్యక్షులు కోట రాంబాబు, కూటమి నాయకులు ఉల్లి శేషగిరిరావు, అద్దంకి పాండురంగారావు, కాగిత రామారావు, గోగినేని సోమశేఖర్, బచ్చు వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల స్మారకోత్సవాలలో భాగంగా ఓపెన్ హౌస్





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పోలీసు అమరవీరుల త్యాగాలను, సేవలను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుంచి 31వ వరకు నిర్వహిస్తున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు ఓపెన్ హౌస్ కార్యక్రమమును నిర్వహించారు.ఈ ఓపెన్ హౌస్ లో సదరు స్టేషన్ భౌగోళిక మ్యాప్, రిసెప్షన్ వ్యవస్థ, కేసు డైరీలు, స్టేషన్ లాక్ అప్స్, స్టేషన్ లో ఉపయోగించే ఆయుధాలు, డయల్ 100, 112 పని చేయు విధానము, పోలీసు వారి యొక్క ముఖ్య విధులు, పోలీస్ యూనిఫామ్ ర్యాంక్స్, ట్రాఫిక్ రూల్స్, చిహ్నాలు, ఎన్డీపీఎస్, గ్యాబ్లింగ్, పోక్సో, ర్యాగింగ్ చట్టాల వివరణ, శిక్షలు, సైబర్ క్రైమ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పోలీసులు రోజువారీ విధుల్లో అత్యంత కీలకంగా వ్యవహరించే కమ్యూనికేషన్ బేస్ సెట్స్, మ్యాన్ ప్యాక్ గురించి వివరించి విద్యార్థులచే పోలీసు కంట్రోల్ రూమ్ చేత పోలీస్ కోడ్ లాంగ్వేజ్ లో మాట్లాడించడం జరిగింది. ఓపెన్ హౌస్ కార్యక్రమానికి హాజరైన విద్యార్థిని, విద్యార్థులు ఎంతో ఆసక్తి వ్యక్తపరుస్తూ పోలీసు వారితో కలిసి పోలీసు వ్యవస్థ యొక్క పనితీరు గురించి తెలుసుకొని, ఆనందం వ్యక్తపరిచారు.

# మహిళలపై ప్రతి రోజు జరుగుతున్న అత్యాచారాలు అరికడతరా

### మహిళా హోమ్ మంత్రి అనితా కి లేక వ్రాసిన గన్నవరం జడ్పిటీసి అన్నవరపు ఎలిజా బెత్ రాణి



**గన్నవరం, అక్టోబర్ 22, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో మహిళలు, మైనర్ బాలికలు, వృద్ధ మహిళల పై గత ఐదు నెలల నుండి అఘాయిత్యాలు జరుగుతున్నాయి. హోం మంత్రి అనితా మహిళా అయి ఉండి కూడా మహిళకు రక్షణ కల్పించాలి, రక్షణ కల్పించా లేకపోవటం చాలా దురదృష్టకరం అని రాష్ట్ర హోమ్ మంత్రి అనితకి లేక ద్వారా కొన్నివివరాలను పంపినట్లు గన్నవరం మండల జడ్పిటీసి అన్న వరపు ఎలిజబెత్ రాణి తెలిపారు. రాష్ట్రంలో మహిళలు ప్రతి రోజూ తమ పిల్లలు ఇంటికి వచ్చే వరకు ఏమి జరుగుతుందోనని భయపడుతున్నారని అం దుకు హోం మంత్రి సరి అయినా చర్యలు తీసుకోవడం లేదు అని మహిళలు అనుకుంటున్నారు. ఇప్పటి వరకు మహిళల మీద జరిగిన ఒక్క ఘటనలో కూడా సరి అయిన చర్యలు ప్రభుత్వం తీసుకోలేదు అని, లేఖలో పంపినట్లు తెలిపారు అందులో కొన్ని ఘటనలు మొదట హోం మంత్రి అనిత నియోజకవర్గంలో ఇద్దరు మహిళలను బట్టలు ఊడదీసి కొట్టిన ఘటనపై ఏవిధమైన మహిళలకు రక్షణా ఇవ్వలేదు. ముద్దాయిలపై సరియైన చర్యలు తీసుకోలేదు. హోమ్ మంత్రి ప్రక్క నియోజకవర్గం లో ఒక బాలిక అదృశ్యమైన హోమ్ మంత్రి పట్టించు కోలేదు. బద్వేలు విద్యార్థనీ దస్తగీర్ అమ్మ ప్రవేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న అమ్మాయిపై అత్యాచారం హత్య, జరగటం దారుణం. కొద్ది వారాల క్రితం హిందూపురంలో అత్తా, కోడలిపై గ్యాంగ్ రేప్ జరిగింది. అది మరువక ముందే మరో గ్యాంగ్ రేప్. కడప జిల్లా గోపవరం మండలంలో దారుణం జరిగింది. సెంచురీ ప్లే వుడ్ కంపెనీ సమీపములో ఇంటర్ విద్యార్థి పై ఐదుగురు మానవ మృగాలు హత్యాచార చేశారు ఆపై పెట్రోల్ పోసినిప్పు అంటించారు వెంటనే ఆ బాలిక కేకలు విన్న స్థానికులు ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు వెంటనే చికిత్స నిమిత్తం బద్వేల్ ఆసుపత్రి కి, తదుపరి కడప రిమ్స్‌కు తరలించారు. మరుచటి రోజు రాత్రి పది గంటలకు మృతి చెందినది. కర్నూల్ జిల్లా అసరి మండలం అశ్విని అనే ఇంటర్ విద్యార్థినికి బలవంతంగా పురుగు మందు త్రాగించి చంపేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో మైనార్టీ బాలిక అదృశ్యం అయింది. బాపట్ల జిల్లాల్లో ఓ యువతిని అపహరించి అత్యాచారం చేసి హత్య చేసారు. నంద్యాల జిల్లా ముచుమర్రిలో జులై 7 వ తేదీన ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని అపహరించి అత్యాచారం చేసి కృష్ణా నదిలో పడవేశారు. చివరకు ధర్మవరం పోలీసు సి ఐ తల్లినీ హత్య చేశారు. ఇలా రోజు రాష్ట్రంలో మహిళలమీద సమాజములో మానవ మృగాలు పేచురిల్లుతుంటే మీరు మహిళా హోమ్ మంత్రి అయి ఉండికూడా మహిళలకు రక్షణా ఇవ్వలేకపొతున్నారు. ఈ తరహా ఘటనలు అన్నిటికీ మీరే భాద్యులు అని రాష్ట్రంలోని మహిళలందరూ భావిస్తున్నారు. మీరు ఇప్పటికైనా ఒక దళిత మంత్రిగా మీకు ఉన్న హక్కులను ఉపయోగించి కుకటివేళ్లతో అన్ని చట్టాలను చేసి, విచారణ తీర్పులు త్వరగా వెలువడే విధంగా ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చూడాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. అలా చర్యలు తీసుకోలేకపోతే మీరే వాటన్నిటికీ భాధ్యత వహించాల్సి ఉంటుందని మీకు ఈ లేక ద్వారా తెలియ జేస్తున్నాను అని ఆమె అన్నారు.

## మోదుమూడిలో వైభవంగా సప్తసప్తాహాలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మోదుమూడిలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో వైభవంగా వార్షిక



సప్తసప్తాహాలు జరుగుతున్న సందర్భంగా మంగళవారం 31వ రోజు 108 సార్లు హనుమాన్ చాలీసా పఠనం, స్వామి వారికి అభిషేకాలు సహ స్రనామార్చనలు పూజలు ఘనంగా నిర్వహించారు. 2 నుండి 4 పాళీ వారి ఆధ్వర్యంలో దాదాపు 3 వేల మందికి అన్న సమారాధన జరిపారు. ఆల యంలో స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బం దులు రాకుండా పాళీ వారు ప్రత్యేక ఏర్పాట్లు గావించారు ఈ 31 రోజులు కూడా స్వామి వారికి ప్రతి రోజు వివిధ రకాల అభిషేకాలు పూజలు ఘనంగా జరుగుతున్నాయని సామాజిక సమన్వయకర్త బచ్చు ఆదినారాయణరావు తెలిపారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన



**కోడూరు, మేజర్ న్యూస్ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణ రావు పేర్కొన్నారు. నాగాయలంకలోని రంగా సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఓటు నమోదు కార్యక్రమాన్ని లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 6 తో నమోదు గడువు ముగియనుండడంతో త్వరతగతిన నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు శిభిరానికి విశేష స్పందన లభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రంలో గ్రామ పార్టీ అధ్యక్షులు ఉప్పల ప్రసాద్, బావదేవరపల్లి సర్పంచ్ మండల ఉదయభాస్కర్, నాగాయలంక-2 ఎంపీటీసీ సభ్యులు లంకె శ్రీనివాస్, కన్నా వెంకటేశ్వరరావు, బోనం పాపారావు, వర్రే రాంబాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు మేడికొండ విజయ్, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మంచాల మహేందర్, ఉప్పల గోపాలరావు, కనగాల రాధా, మేడేపల్లి పృధ్విరాజ్,తదితరులు పాల్గొన్నారు.

## వెండి శంఖం ఇచ్చిన దుర్గా నాగేశ్వరప్రసాద్ దంపతులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బచ్చుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంనకు చిరువోలు దుర్గానాగేశ్వర ప్రసాద్ పద్మజారాణి దంపతులు శ్రీ స్వామి వారి అభిషేక కైంకర్య నిమిత్తం 44000 రూపాయల విలువగల వెండి శంఖం వంశపారంపర్య ధర్మకర్త ముత్తేవి రవికాంత్‌కి అందజేశారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999